తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | గురువారం - 13- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 70 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in


# గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించాలి

## దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలు పెంచాలని ఆదేశం

**ముంపు గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని సూచన**

**నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతిపై సీఎం సమీక్ష**



**హైదరాబాద్, ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుతో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు ఎత్తిపోతలు నిర్వహించాలని సూచించారు. నీటిపారుదల శాఖ పనితీరుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులతో ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో దేవాదుల ప్రాజెక్టు నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా తొమ్మిది పంపుల ద్వారా ఎత్తిపోతలు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టులకు సంబంధించిన ఎత్తిపోతల పనుల్లో చిన్నచిన్న సమస్యలు ఉన్నా

మిగతా 2లో



# మిల్లర్ల బకాయిల వసూలుపై సీఎం కఠిన హెచ్చరిక

- ప్రతి ధాన్యం గింజకు సంబంధించిన బకాయి వసూలు చేయాలని ఆదేశం
- మొండి బకాయిదారుల మిల్లులకు బదులుగా మహిళా సంఘాలకు మిల్లింగ్ బాధ్యతలు
- ధాన్యం నిల్వ కోసం సైలో బ్యాగులు, ప్రత్యామ్నాయ గోదాముల ఏర్పాటుకు కార్యాచరణ

**హైదరాబాద్, ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):**

మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని పూర్తిగా వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నిర్వహించే వారితో ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తుందని, అయితే ఉద్దేశపూర్వకంగా బకాయిల ఎగవేతకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పౌర సరఫరాల శాఖపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని, ఆ తప్పిదాల భారాన్ని ప్రస్తుత ప్రభుత్వంపై మోపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి విమర్శించారు. ఇప్పటికే బకాయిల వసూళ్లలో కొంత పురోగతి సాధించినప్పటికీ, ప్రతి ధాన్యం గింజకు సంబంధించిన బకాయిని కూడా వదలకుండా వసూలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ అంశంపై సమగ్ర విధివిధానాలు రూపొందించి, వాటిని మంత్రివర్గ ఉపసంఘానికి సమర్పించాలని ఆదేశించారు.

మిగతా 2లో

# ఆర్మీ నియామకాలకు తెలంగాణ యువతకు ప్రత్యేక శిక్షణ

- సదరన్ కమాండ్ అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం
- జిల్లా కేంద్రాల్లో శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు సానుకూల స్పందన
- విపత్తుల సమయంలో ఆర్మీ సహకారం మరింత పెంచాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):**

భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతకు అధిక అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ఇన్‌చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ పలువురు ఆర్మీ ప్రతినిధులతో కలిసి ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

మిగతా 2లో



# మహిళా సంఘాలకు ధాన్యం మిల్లింగ్ బాధ్యతలు..

## సీఎం నిర్ణయానికి మంత్రి సీతక్క హర్షం

**హైదరాబాద్, ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):**

మహిళా స్వయం సహాయక సంఘాలకు మరిన్ని ఆర్థిక అవకాశాలు కల్పించే దిశగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. ధాన్యం మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించడంతో పాటు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆధునిక ధాన్యం నిల్వ కేంద్రాల ఏర్పాటుకు ప్రతి నియోజకవర్గంలో 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం మహిళా సాధికారతకు కొత్త దిశను చూపుతుందని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే మహిళా సంఘాల ద్వారా వివిధ రంగాల్లో ఉపాధి, ఆదాయ అవకాశాలను ప్రభుత్వం విజయవంతంగా కల్పిస్తోందని సీతక్క తెలిపారు. తాజాగా ధాన్యం మిల్లింగ్, నిల్వ రంగాల్లోనూ మహిళా



సంఘాలకు అవకాశాలు కల్పించడం ద్వారా గ్రామీణ మహిళలకు పెద్ద ఎత్తున ఉపాధి, వ్యాపార అవకాశాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈ నిర్ణయం మహిళల ఆర్థిక స్థితిని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించాలన్న నిర్ణయం స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారతకు మరింత బలం చేకూరుస్తుందని మంత్రి తెలిపారు.

మిగతా 2లో

# తెలంగాణ వ్యవసాయ విధానాలపై బిహార్ ఆసక్తి

- తుమ్మలతో బిహార్ వ్యవసాయ మంత్రి భేటీ
- ఆయిల్‌పామ్ సాగుపై అధ్యయనానికి బిహార్ సిద్ధం
- మఖానా సాగుపై తెలంగాణ దృష్టి
- సాంకేతిక పరిజ్ఞాన మార్పిడికి రెండు రాష్ట్రాల అంగీకారం

2లో





# తిరంగా స్ఫూర్తితో ముందుకు సాగాలి

పాతబస్తీలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహణ

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్మరణ

దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం

వికసిత్ భారత్ నిర్మాణమే సమష్టి సంకల్పం

**హైదరాబాద్, ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):**

హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా హైదరాబాద్ పాతబస్తీలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు త్రివర్ణ పతాకాలను చేతబట్టి ర్యాలీలో పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో పాతబస్తీ ప్రాంతం సందడిగా మారింది. ఈ సందర్భంగా

మిగతా 7లో

# ఎయిడ్స్ నియంత్రణకు భారీ అవగాహన ర్యాలీ

- 1500 మందితో నగరంలో విస్తృత ప్రచారం
- రెండు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు
- హెచ్ఐవీ నివారణలో అందరి భాగస్వామ్యం అవసరం
- పాల్గొన్న మంత్రి పొన్నం

2లో






# గిరిజన యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


- టీఐసీసీఐ సిద్దిపేట అధ్యాయం ప్రారంభోత్సవంలో హరీశ్‌రావు
- ఉద్యోగాలు పొందేవారి నుంచి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి
- ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని సూచన
- గిరిజనుల సమస్యలపై ప్రతిపక్షంగా పోరాడతామన్న హరీశ్‌రావు

**సిద్దిపేట, ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):**

సిద్దిపేటలో ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు, సిద్దిపేట అధ్యాయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజన యువత ఉద్యోగాల కోసం వెతుక్కునే స్థాయి నుంచి పదిమందికి ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. గిరిజన యువతకు వ్యాపార రంగంలో అవకాశాలను పరిచయం చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలను ఎలా పొందాలి, వాటిని ఏ విధంగా వినియోగించుకోవాలనే అంశాలపై టీఐసీసీఐ

మిగతా 7లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించాలి

(మొదటి పేజీ తరువాయి)

వాటిని వెంటనే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. గోదావరి నీటిని రైతులకు, సాగుభూములకు మరింత సమర్థవంతంగా అందించేందుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు.

పలు ప్రాజెక్టుల పరిధిలో ఒకటి రెండు గ్రామాలు, కొద్దిపాటి వ్యవసాయ భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి పెండింగ్‌లో ఉన్న పరిహారం చెల్లింపులను వెంటనే పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పునరావాసం, పరిహారానికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు ఎలాంటి జాప్యం లేకుండా పరిహారం అందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయితే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీటిని నింపేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రాజెక్టుల పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకునే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల పథకాల సామర్థ్య పెంపుపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. గూడెం దొడ్డి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్‌ను నియమించి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరుల వినియోగంపై దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీటి నిల్వలు చేపట్టడం లేదని సమావేశంలో చర్చ జరిగింది. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీల్లోనూ పలు లోపాలు ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ సూచనలను పూర్తిగా పాటించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ అంశంపై సంబంధిత సంస్థతో నిరంతర సంప్రదింపులు కొనసాగిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# మిల్లర్ల బకాయిల వసూలుపై సీఎం కఠిన హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

విధివిధానాలపై మంత్రివర్గ ఉపసంఘం పరిశీలన అనంతరం ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. బకాయిలు చెల్లించకుండా మొండి వైఖరి ప్రదర్శిస్తున్న మిల్లర్లకు భవిష్యత్తులో ధాన్యం కేటాయింపులు నిలిపివేసి, ఆ బాధ్యతలను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు ఇది దోహదపడటంతో పాటు ధాన్యం మిల్లింగ్ వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి సీజన్‌లో ధాన్యం నిల్వ సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ధాన్యం ఉత్పత్తి అధికంగా ఉండే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద సైలో బ్యాగుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిల్వ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ, నిల్వ ప్రక్రియను సులభతరం చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సైలో బ్యాగుల నిర్మాణం కోసం ప్రతి నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయించే అంశాన్ని కూడా ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల అమలుకు సంబంధించి రెవెన్యూ, పౌర సరఫరాలు, మహిళా



సంక్షేమ శాఖల మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్యాచరణను ఖరారు చేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలకు కొత్త ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ధాన్యం నిల్వ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ధాన్యం నిల్వ కోసం సంప్రదాయ గోదాములతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై కూడా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. విశాలమైన ప్లాట్‌ఫార్మ్‌ల నిర్మాణం, జర్మన్ టెంట్ల వినియోగం వంటి అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అలాగే మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, కళ్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి అవసరమైతే లీజుకు తీసుకోవాలని చెప్పారు. రైతుల నుంచి సేకరించే ధాన్యం నిల్వలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులకు స్పష్టం చేశారు.




# ఎయిడ్స్ నియంత్రణకు భారీ అవగాహన ర్యాలీ

**హైదరాబాద్, ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):** హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ వంటి వ్యాధుల నియంత్రణ, నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు హైదరాబాద్‌లో బుధవారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో హెచ్ఎండీఏ గ్రౌండ్స్ నుంచి నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వరకు జరిగిన ఈ ర్యాలీలో సుమారు 1500 మంది పాల్గొన్నారు. హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అవగాహన కార్యకర్తలు హెచ్ఐవీ నివారణకు సంబంధించిన నినాదాలు చేస్తూ ప్రజలకు సందేశం అందించారు. హెచ్ఐవీ వ్యాప్తిని అరికట్టడంలో అవగాహనే ప్రధాన ఆయుధమని, వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణలో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కొత్తగా ఎవరూ హెచ్ఐవీ బారిన పడకుండా నివారణ చర్యలపై అవగాహన పెంచడంతో పాటు, హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి అవసరమైన వైద్య సేవలు, మానసిక ధైర్యం అందించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాధి పట్ల వివక్ష చూపకుండా మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న గర్భిణీలకు సరైన వైద్య సేవలు అందించడం ద్వారా పుట్టబోయే శిశువులకు వైరస్ సంక్రమణను నివారించవచ్చని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన పరీక్షలు, చికిత్సలు, మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా సరైన సమాచారాన్ని తెలుసుకుని అవసరమైనప్పుడు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ఆగస్టు 12 నుంచి వచ్చే రెండు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు అవగాహన సదస్సులు, ర్యాలీలు, ఆరోగ్య శిబిరాలు, ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో యువత, మహిళలు, విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని కోరారు. "బి పాజిటివ్ - స్టాప్ హెచ్ఐవీ పాజిటివ్" అనే నినాదంతో తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సమాచార శాఖ కమిషనర్ ముకుంద రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఆర్మీ నియామకాలకు తెలంగాణ యువతకు ప్రత్యేక శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్మీ నియామకాల్లో స్థానిక యువత ఎక్కువ సంఖ్యలో ఎంపికయ్యేలా ఆసక్తి ఉన్న జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు సైన్యంలో చేరే అవకాశాలపై అవగాహన కల్పించడంతో పాటు వారికి శారీరక, మానసిక శిక్షణ అందించే కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ సానుకూలంగా స్పందించి, రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని కార్యాచరణ చేపడతామని తెలిపారు.

దేశవ్యాప్తంగా నిర్వహించే ఆర్మీ నియామక పరీక్షలకు ముందుగానే తెలంగాణలోని పలు జిల్లా కేంద్రాల్లో శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి యువతను సిద్ధం చేస్తామని ఆర్మీ అధికారులు వెల్లడించారు. దీంతో రాష్ట్ర యువతకు సైన్యంలో చేరేందుకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడుతుందని అభిప్రాయపడుతున్నారు. ఆర్మీ ఉద్యోగాల పట్ల ఆసక్తి ఉన్న యువతకు అవసరమైన మార్గదర్శకత్వం, శిక్షణ అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. దేశంలో ప్రకృతి విపత్తులు, అత్యవసర పరిస్థితుల సమయంలో భారత ఆర్మీ పోషిస్తున్న పాత్రను ముఖ్యమంత్రి ప్రశంసించారు. తెలంగాణలో వరదలు, ఇతర విపత్తులు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సహాయక చర్యలు చేపట్టడం, పునరావాస కార్యక్రమాల్లో ఆర్మీ యంత్రాంగం మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్ర ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణలో ఆర్మీ సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి విజ్ఞప్తికి స్పందించిన లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ తెలంగాణలో విపత్తు పరిస్థితులు ఏర్పడినప్పుడు స్థానిక ఆర్మీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకునేలా అవసరమైన సూచనలు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల భద్రతకు సంబంధించిన అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం కొనసాగిస్తామని తెలిపారు. విపత్తుల సమయంలో వేగవంతమైన స్పందన కోసం అవసరమైన ఏర్పాట్లు ఉంటాయని పేర్కొన్నారు. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు చారిత్రక హైదరాబాద్ నగరానికి పూర్వవైభవం తీసుకురావాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని లెఫ్టినెంట్ జనరల్ అభినందించారు. హైదరాబాద్ భవిష్యత్తు అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కోసం మూసీ నది పునరుద్ధరణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ ఎన్. శ్రీనివాస్ రావుతో పాటు ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యవసాయ విధానాలపై బిహార్ ఆసక్తి

**హైదరాబాద్, ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో అమలవుతున్న వ్యవసాయ విధానాలు, రైతు సంక్షేమ కార్యక్రమాలు, సాంకేతిక ఆధారిత వ్యవసాయ వ్యవస్థ దేశంలోని ఇతర రాష్ట్రాల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బిహార్ వ్యవసాయ మంత్రి విజయ్ కుమార్ సిన్హా బుధవారం సచివాలయంలో తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. వ్యవసాయ రంగంలో పరస్పర సహకారం, పంటల వైవిధ్యీకరణ, సాంకేతిక పరిజ్ఞానం మార్పిడి, రైతుల ఆదాయ పెంపు వంటి అంశాలపై ఇరువురు మంత్రులు విస్తృతంగా చర్చించారు. తెలంగాణలో అమలవుతున్న ఆధునిక వ్యవసాయ విధానాలపై బిహార్ ప్రతినిధి బృందం ప్రత్యేక ఆసక్తి కనబరిచింది. సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న డిజిటల్ సేవలను తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. రైతులకు వాతావరణ హెచ్చరికలు పంపించడం, రైతు నేస్తం కార్యక్రమం ద్వారా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడం, పంటల నమోదు, ఉపగ్రహాల ద్వారా పంటల పర్యవేక్షణ, యూరియా బుకింగ్ యాప్, అగ్రిస్టాక్ వంటి కార్యక్రమాల ద్వారా వ్యవసాయాన్ని మరింత ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. కృత్రిమ మేధస్సు ఆధారిత "కృషివాస్" వ్యవస్థ ద్వారా పంటల్లో వచ్చే సమస్యలను ముందుగానే గుర్తించి రైతులకు సకాలంలో సూచనలు అందిస్తున్నామని తెలిపారు. ఈ చర్యల వల్ల సాగు ఖర్చులు తగ్గడంతో పాటు దిగుబడులు, లాభాలు పెరుగుతున్నాయని వివరించారు. రైతు సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తుమ్మల పేర్కొన్నారు. రైతుబంధు, రైతుబీమా, రైతు భరోసా వంటి పథకాలతో పాటు సన్నరకం వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల కోసం సుమారు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేయడంతో పాటు ఎకరానికి సంవత్సరానికి రూ.12 వేల రైతు భరోసా అందిస్తున్నామని తెలిపారు. దేశంలో అత్యధిక వరి ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు. పంటల వైవిధ్యీకరణలో తెలంగాణ ముందంజలో ఉందని మంత్రి వివరించారు. వరి, పత్తితో పాటు మొక్కజొన్న, కందులు, సోయాబీన్, మామిడి, మిర్చి, పసుపు, ఆయిల్‌పామ్ సాగు గణనీయంగా పెరుగుతోందన్నారు. దేశంలో ఆయిల్‌పామ్ సాగులో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని, 202526లో 3.11 లక్షల ఎకరాల్లో సాగు చేసి 74 వేల మెట్రిక్ టన్నుల క్రూడ్ పామ్ ఆయిల్ ఉత్పత్తి సాధించామని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, నర్సరీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, మైక్రో ఇరిగేషన్ సదుపాయాలపై బిహార్ మంత్రి ప్రత్యేకంగా వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా బిహార్ వ్యవసాయ మంత్రి విజయ్ కుమార్ సిన్హా తమ రాష్ట్రంలో అమలవుతున్న వ్యవసాయ విధానాలను వివరించారు. బిహార్‌లో 91 శాతం మంది చిన్న, సన్నకారు రైతులేనని, రాష్ట్ర జనాభాలో 77 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని చెప్పారు. మఖానా, మొక్కజొన్న, పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాల కోసం ప్రత్యేక వ్యవసాయ క్లస్టర్లు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. దర్భంగా, మధుబని, సీతామర్హి ప్రాంతాల్లో మఖానా క్లస్టర్లు ఏర్పాటు చేసి ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. మఖానా ఉత్పత్తి అభివృద్ధి కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసినట్లు కూడా వివరించారు. ఆయిల్‌పామ్ సాగును బిహార్‌లో ప్రవేశపెట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేసిన విజయ్ కుమార్ సిన్హా, త్వరలో అధికారుల బృందాన్ని తెలంగాణకు పంపనున్నట్లు తెలిపారు. అలాగే మఖానా సాగు, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్ విధానాలను అధ్యయనం చేసేందుకు తెలంగాణ బృందం బిహార్‌ను సందర్శించనుంది. రైతుల ఆదాయం పెంచడం, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడం, మార్కెట్ అవకాశాలను విస్తరించడం లక్ష్యంగా రెండు రాష్ట్రాలు పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించాయి. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ఉద్యానవన శాఖ ప్రతినిధులు, ఇరు రాష్ట్రాల వ్యవసాయ నిపుణులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు ధాన్యం మిల్లింగ్ బాధ్యతలు..

(మొదటి పేజీ తరువాయి)

మహిళా సంఘాలను కేవలం పొదుపు, రుణాలకే పరిమితం చేయకుండా ఉత్పత్తి, ప్రాసెసింగ్, నిల్వ, మార్కెటింగ్ వంటి అన్ని రంగాల్లో భాగస్వాములను చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని వివరించారు. ధాన్యం నిల్వకు ప్రతి సీజన్‌లో ఎదురవుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా నియోజకవర్గాల వారీగా భూములను కేటాయించి, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆధునిక సైలో బ్యాగులు, గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం అభినందనీయమని సీతక్క అన్నారు. దీనివల్ల రైతులకు కూడా



ప్రయోజనం కలగడంతో పాటు ధాన్యం నిల్వలో నష్టాలు తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆధునిక గోదాములు, మిల్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా మహిళలకు స్థిరమైన ఉపాధి, సంఘాలకు నిరంతర ఆదాయం లభిస్తుందని మంత్రి తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మహిళల పాత్ర మరింత బలోపేతం అవుతుందని, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇది కీలక అడుగుగా నిలుస్తుందని చెప్పారు. ప్రజా ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో ఆర్థికంగా స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తోందని సీతక్క పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్రంలోని లక్షలాది మహిళా సంఘాలకు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయని, మహిళా సంఘాలను ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలు అమలు చేస్తుందని ఆమె స్పష్టం చేశారు.

# బంగారం ధరలు మళ్లీ భగ్గుమన్నాయి..

**హైదరాబాద్, ఆగస్టు 12, 2026 (తెలంగాణ ముచ్చట్లు):** దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో బంగారానికి పెరుగుతున్న డిమాండ్ కారణంగా పసిడి ధరలు మరోసారి భారీగా పెరిగాయి. బుధవారం బులియన్ మార్కెట్ ట్రేడింగ్‌లో బంగారం రేట్లు గత రెండు నెలల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. హైదరాబాద్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,53,850కు చేరింది.

అంతర్జాతీయ మార్కెట్లలో బంగారానికి డిమాండ్ గణనీయంగా పెరగడం ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తోంది. ముఖ్యంగా చైనా సెంట్రల్ బ్యాంకుతో పాటు పలు సంస్థాగత ఇన్వెస్టర్లు భారీగా బంగారాన్ని కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో అంతర్జాతీయంగా పసిడికి డిమాండ్ పెరిగి ధరలపై ప్రభావం చూపుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో కనిపిస్తున్న ఈ ప్రభావం దేశీయ బులియన్ మార్కెట్లపైనా పడుతోంది. ఫలితంగా హైదరాబాద్ సహా పలు నగరాల్లో బంగారం ధరలు మరోసారి భారీగా పెరిగాయి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, తిరుపతి తదితర నగరాల్లో దాదాపు ఒకే స్థాయిలో బంగారం ధరలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,53,850గా ఉండగా,



22 క్యారెట్ల ధర రూ.1,41,010గా, 18 క్యారెట్ల ధర రూ.1,15,380గా నమోదైంది. దేశంలోని ప్రధాన నగరాల్లోనూ పసిడి ధరలు భారీగా ఉన్నాయి. చెన్నైలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,54,380గా నమోదై అత్యధికంగా ఉంది. న్యూఢిల్లీలో రూ.1,53,980, ముంబైలో రూ.1,53,830గా ఉంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# పెద్దమందడిలో నేడు బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ



**పెద్దమందడి,ఆగస్టు12(తెలంగాణ ముచ్చట్లు):**భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలో నేడు (ఆగస్టు 13) ఉదయం 11 గంటలకు తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ పెద్దమండి మండల అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య తెలిపారు.మండలంలోని ప్రతి బీజేపీ కార్యకర్త, మండల నాయకులు, జిల్లా నాయకులు, బూత్ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటేలా నిర్వహించనున్న ఈ ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.పెద్దమందడి మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని ముప్పూరి చెన్నయ్య విజ్ఞప్తి చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామసభ

- **పామిరెడ్డిపల్లి సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం**



**పెద్దమందడి,ఆగస్టు12(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలు, వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.గ్రామంలోని పాడుబడ్డ ఇళ్ల నుంచి విషపురుగులు పక్క ఇళ్లలోకి వస్తున్నాయని గ్రామస్థులు సర్పంచ్ దృష్టికి తీసుకురాగా, పాడుబడ్డ ఇళ్లను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా పార్టీలకు అతీతంగా ఎంపిక చేస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.ఈ సమావేశంలో ఉపసర్పంచ్ రాములమ్మ హనుమంతు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఉద్యమబాట

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యారంగం, ఉపాధ్యాయ రంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో రెండో దశ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో జమ్మికుంట తహసీల్దార్‌కు మెమోరాండం సమర్పించారు.
ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ రంగానికి సంబంధించిన అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం తక్షణమే వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయులను సమీకరించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
పీఆర్సీ కమిషన్ నివేదికను వెంటనే తెప్పించి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని కోరారు. జీవో 25ను సవరించి ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు.
టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అవినాష్ మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డీటీఎఫ్ మండల అధ్యక్షుడు వేణుమాధవ్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టనున్న వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియలో ఎలాంటి పైరవీలకు తావు లేకుండా పూర్తి పారదర్శకత పాటించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో జమ్మికుంట టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, డీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కె.సంపత్, డీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.సదానందం, డీటీఎఫ్ సీనియర్ నాయకులు ఎం.శ్రీనివాస్, పి.రాజు, పి.విజేందర్ రెడ్డి, హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చౌడేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- **సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్**



**వనపర్తి,ఆగస్టు12(తెలంగాణ ముచ్చట్లు):** తాటిపాముల గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి ప్రకాష్ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో వనపర్తి జిల్లా సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. చౌడేశ్వరి అమ్మవారి ఆశీస్సులు తాటిపాముల గ్రామ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆలయ కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తోట పుల్లయ్య, కృష్ణయ్య, రాము గోపాల్, డా. నారాయణ, రాజశేఖర్, నవీన్, జానకి రాములు, నర్సింహ, వెంకటయ్య పాల్గొన్నారు.

# పెట్రోల్ బంక్ కార్మికులకు కనీస వేతనాలేవీ?

- **ప్రభుత్వ జీవోలు కాగితాలకే పరిమితం..**
- **యాజమాన్యాలపై చర్యలేవీ?**



**వీణవంక, ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):** పెట్రోల్ బంక్ కార్మికులకు ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు అమలు కాకపోవడంతో కార్మికులు తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని ఆరోపించారు.
బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వీణవంక మండల కేంద్రంలోని పలు పెట్రోల్ బంకులను సందర్శించి కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. కనీస వేతనాల జీవో నంబర్ 6 ప్రకారం మే 30న ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసి, జూన్ 1 నుంచి ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఆదేశించినప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నారు.
వీణవంకలోని పలు బంకుల్లో కార్మికులకు నెలకు రూ.8,500 నుంచి రూ.10 వేల వరకు మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నట్లు సర్వేలో తేలిందన్నారు. జోన్‌ల వారీగా నిర్దేశించిన కనీస వేతనాలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యాలు నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. నెలసరి వేతనంతో పాటు కార్మికులకు బోనస్, పీఎఫ్, ఇన్సూరెన్స్ తదితర చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాల అమలుపై కార్మిక శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, అయినా సమస్య పరిష్కారం కాకపోతే కార్మికులను సమీకరించి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సాగర్ల కుమార్ పాల్గొన్నారు.






# మున్సిపల్ ఆస్తుల పరిరక్షణకు పటిష్ట చర్యలు

**జమ్మికుంట టౌన్, ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణానికి గతంలో తాగునీరు అందించిన విలాసాగర్ వాటర్ పంప్‌హౌస్‌తో పాటు పరిసరాల్లోని మున్సిపల్ స్థలాలను పరిరక్షించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ అధికారులను ఆదేశించారు. బుధవారం విలాసాగర్ గ్రామంలోని వాటర్ పంప్‌హౌస్, మున్సిపల్ స్థలాలు, పరిసర ప్రాంతాలను చైర్మన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపల్ ఆస్తుల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విలువైన మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ స్థలాల చుట్టూ కంపౌండ్ వాల్ నిర్మాణానికి అవసరమైన చర్యలను త్వరితగతిన పూర్తి చేయాలని, స్థలాల హద్దులను స్పష్టంగా గుర్తించి రక్షణ కల్పించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఆస్తుల సంరక్షణలో నిర్లక్ష్యానికి తావులేకుండా పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. పట్టణ ప్రజలకు ఉపయోగపడే మున్సిపల్ ఆస్తులను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని చైర్మన్ పేర్కొన్నారు. సంబంధిత పనులను వేగవంతంగా పూర్తి చేసి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్ స్వామి, టీపీఎస్ రమేష్, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కౌశిక్‌రెడ్డికి ఇంగిలే రామారావు ఘాటు హెచ్చరిక

- **కాంగ్రెస్‌పై విమర్శలు మానుకో..**
- **హుజూరాబాద్ అభివృద్ధిపై దృష్టి పెట్టు**



**ఇల్లంతకుంట, ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):** కమలాపూర్‌లో ఇటీవల జరిగిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడిన తీరును కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులు, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబుపై అనవసర ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు.
బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇంగిలే రామారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వానికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే కౌశిక్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రతి సమావేశంలో ఆయన వ్యవహరిస్తున్న తీరు ప్రజలకు విసుగు తెప్పిస్తోందన్నారు.
ప్రజాపాలనలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తుంటే ప్రతిపక్ష నాయకులు ఓర్వలేక ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా కౌశిక్‌రెడ్డి గెలిచి మూడేళ్లు కావస్తున్నా నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. వొడితల ప్రణవ్‌బాబు ఆధ్వర్యంలో హుజూరాబాద్ నియోజకవర్గం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని పేర్కొన్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, అందుకే ప్రతిపక్ష నాయకులు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించగలుగుతున్నారని రామారావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ, మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జిపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.
అదేవిధంగా రాజకీయ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతిలోనే వ్యక్తం చేయాలని, దాడులు లేదా వాటికి సంబంధించిన హెచ్చరికలు చేయడం సరికాదని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే అన్ని పార్టీలకు తగిన సమాధానం చెబుతారని అన్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ప్రతిపక్షాలకు చెందిన నాయకులు సైతం ప్రశంసిస్తున్నారని రామారావు పేర్కొన్నారు. కౌశిక్‌రెడ్డి తన వైఖరిని మార్చుకుని హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ధర్మకర్త గోలి కిరణ్, డీసీసీ కార్యదర్శి మ్యాకమల్ల అశోక్, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గుండారపు సాయి, కాంగ్రెస్ నాయకులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# దమ్ముంటే రాజకీయంగా ఎదుర్కోండి

- **పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడితే ఊరుకోం..**
- **కౌశిక్‌రెడ్డికి దేశిని కోటి హెచ్చరిక**



**జమ్మికుంట టౌన్ ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):** హుజూరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబుకు పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో వివాదం సృష్టించారని కాంగ్రెస్ నాయకుడు దేశిని కోటి ఆరోపించారు. వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని, దమ్ము, ధైర్యం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలని కౌశిక్‌రెడ్డిని హెచ్చరించారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరీ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దేశిని కోటి మాట్లాడారు. కమలాపూర్ మండలంలోని నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించేందుకు వొడితల ప్రణవ్‌బాబు చొరవ తీసుకున్నారని తెలిపారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సహకారంతో ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. అయితే ప్రణవ్‌బాబుకు వస్తున్న ప్రజాదరణను చూసి జీర్ణించుకోలేకే కౌశిక్‌రెడ్డి కార్యక్రమంలో రచ్చ చేశారని దేశిని కోటి విమర్శించారు. మంత్రులు హుందాగా వ్యవహరించాలని సూచించినప్పటికీ ఆయన తన తీరు మార్చుకోలేదని ఆరోపించారు. ప్రణవ్‌బాబుపై కౌశిక్‌రెడ్డి అనుచరులు ఇష్టారీతిన వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని, ఇకపై అలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కౌశిక్‌రెడ్డి లాంటి నాయకత్వం హుజూరాబాద్ నియోజకవర్గానికి అవసరం లేదని దేశిని కోటి అన్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో ప్రజలు ఆయనకు తగిన గుణపాఠం చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో కౌశిక్‌రెడ్డికి 10 వేల ఓట్లు కూడా దాటే పరిస్థితి లేదని, టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తే డిపాజిట్ కూడా దక్కదని ఆయన వ్యాఖ్యానించారు.గతంలో ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో కార్యకర్తలు, నాయకులను పట్టించుకోలేదని కౌశిక్‌రెడ్డిపై ఆరోపణలు చేశారు. ఆయనను నమ్ముకుని టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇబ్బందులు పడవద్దని సూచించారు.
బీసీ బంధుపై ప్రశ్నలు
బీసీ వర్గాలకు అమలు చేసిన బీసీ బంధు పథకంపై దేశిని కోటి ప్రశ్నలు సంధించారు. బీసీ బిడ్డలకు బీసీ బంధు అందిందా? అది ఎక్కడికి వెళ్లిందో ఒక్కసారి ఆలోచించాలని కోరారు. కౌశిక్‌రెడ్డిని నమ్ముకుంటే భవిష్యత్తు దెబ్బతింటుందని, ప్రజలకు మంచి మనసుతో సేవ చేస్తున్న వొడితల ప్రణవ్‌బాబుపై అనవసర విమర్శలు చేయవద్దని బీసీ వర్గాలకు విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, హుజూరాబాద్ నియోజకవర్గంలో వొడితల ప్రణవ్‌బాబు ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని దేశిని కోటి ధీమా వ్యక్తం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నేడు అమ్మపల్లికి ఎమ్మెల్యే రాక

- **అమ్మపల్లి సర్పంచ్ గౌని మాధవి వెంకటేశ్వర్ రెడ్డి**



**పెద్దమందడి,ఆగస్టు12(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి నేడు రానున్నారు. ఉదయం 9 గంటలకు నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం ప్రారంభోత్సవం, పూజా కార్యక్రమాలు ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు అమ్మపల్లి గ్రామ సర్పంచ్ గౌని మాధవి వెంకటేశ్వర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు. అలాగే మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ గౌని మాధవి వెంకటేశ్వర్ రెడ్డి కోరారు.

# క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- **అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సూచన**



**వనపర్తి,ఆగస్టు12(తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ సూచించారు. వనపర్తి పట్టణంలోని బండార్‌నగర్ ఎంపీపీఎస్ పాఠశాలను బుధవారం సందర్శించిన ఆమె విద్యార్థులకు ఉచిత పాఠశాల యూనిఫార్మ్‌లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన ఆమె.. ప్రతిరోజూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరవుతూ.. అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన వంటశాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. వంటశాలలో పరిశుభ్రత, హైజీన్‌తో పాటు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు.కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, వార్డు కౌన్సిలర్ శిరీష రమేష్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, మున్సిపల్, మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం నీటిని కేఎల్ఐ ద్వారా అందించే అవకాశాలు పరిశీలించాలి

- **వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**వనపర్తి,ఆగస్టు12(తెలంగాణ ముచ్చట్లు):** ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచించారు. ఇప్పటికే వరి సాగు చేసిన రైతులను ఆదుకునేందుకు అవసరమైన మేరకు సాగునీరు అందించాలని, శ్రీశైలం నీటిని కేఎల్ఐ ద్వారా అందించే అవకాశాలను పరిశీలించాలని కోరారు. బుధవారం వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన నిర్వహించిన సాగునీటి సలహా మండలి సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, సాగు, తాగునీటి అవసరాలపై సమీక్షించారు.ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ..పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నార్లాపూర్, ఏదుల, వట్టెం రిజర్వాయర్లను నింపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొంతమేర నీటిని విడుదల చేయగలిగితే ఇప్పటికే వరి సాగు చేసిన రైతులు నష్టపోకుండా బయటపడే అవకాశం ఉంటుందని తెలిపారు. కొత్తకోట మండలంలోని శంకర సముద్రం రిజర్వాయర్‌ను కూడా నింపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరును సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. భవిష్యత్‌లో నీటి కొరత సమస్య తలెత్తకుండా రైతులను ఆరుతడి పంటల వైపు మళ్లించాలని, నీటి లభ్యతపై ముందుగానే అవగాహన కల్పించాలని సమావేశంలో సూచించారు. సమావేశంలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ ఇళ్లకు కాంగ్రెస్ ప్రచారమా?

- **పొంగులేటి సమాధానం చెప్పాలి: ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి**




**హుజురాబాద్,ఆగస్టు 12(తెలంగాణ ముచ్చట్లు ):** కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు ప్రారంభోత్సవాలు నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శించారు. కమలాపూర్‌లో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరైన నేపథ్యంలో ఎమ్మెల్యే ఈ వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ సమావేశాల్లోనే పూర్తయిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలని తాను కోరినట్లు కౌశిక్ రెడ్డి తెలిపారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం రూ.5 లక్షలకు పైగా ఖర్చు చేసిందని, కమలాపూర్‌లో దాదాపు రూ.ఇరవై కోట్లతో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కోసం ఒక్కో ఇంటికి రూ.లక్ష కేటాయించినప్పటికీ, అవి పూర్తికాకముందే మంత్రి హడావుడిగా వచ్చి ప్రారంభోత్సవం చేశారని ఆరోపించారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో ఇంకా కనీస మౌలిక సదుపాయాలు పూర్తి కాలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో ఇంటిపై కనీసం రూ.ఇరవై కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. కేసీఆర్ నిర్మించిన ఇళ్లను కేసీఆర్ కట్టించారని చెప్పినందుకు మంత్రికి ఎందుకు కోపం వచ్చిందని ప్రశ్నించారు.

ఇందిరమ్మ ఇళ్ల విషయంలోనూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. వెయ్యి నాలుగు మంది లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసినప్పటికీ చివరి రూ.ఒకటిఅరవై లక్షల ఇన్‌స్టాల్‌మెంట్ ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ఒక్కో ఇందిరమ్మ ఇంటికి రూ.పది లక్షల వరకు ఖర్చవుతుంటే ప్రభుత్వం ఇస్తున్న రూ.ఐదు లక్షలు ఎలా సరిపోతాయని నిలదీశారు.

హుజురాబాద్ ప్రజల సమస్యలపై మాట్లాడే హక్కు తనకు ఉందని, మంత్రి పొంగులేటి బెదిరింపులకు తాను భయపడబోనని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో హౌసింగ్ అంశంపై చర్చ జరిగితే అన్ని విషయాలను సభలో ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తానన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్‌లో జెండా మోసిన కార్యకర్తలకు విలువ లేకుండా పోయిందని, ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులు పెత్తనం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో రెండేళ్ల తర్వాత కాంగ్రెస్ పరిస్థితి ఆంధ్రప్రదేశ్ మాదిరిగా మారే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. కమలాపూర్‌లో మంత్రి పొంగులేటి కేవలం ఐదుగురు లబ్ధిదారులకు మాత్రమే డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పట్టాలు అందించారని కౌశిక్ రెడ్డి తెలిపారు. మిగతా అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు ఎప్పుడు ఇస్తారో మంత్రి స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

# తిరంగా ర్యాలీతో దేశభక్తి చాటిన బీజేపీ

- **జాతీయ జెండాలతో భారీగా పాల్గొన్న బీజేపీ శ్రేణులు**





**హుజురాబాద్, ఆగస్టు 12(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణంలో బుధవారం 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ ఘనంగా నిర్వహించారు. బీజేపీ హుజురాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ దేశభక్తి నినాదాలతో హోరెత్తింది. జాతీయ జెండాలను చేతబూనిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొనడంతో పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ప్రాధాన్యతను చాటుతూ, దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా దేశభక్తి భావాలను పెంపొందించుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశంపై తమకున్న గౌరవాన్ని చాటాలని నాయకులు కోరారు. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ అభివృద్ధి, ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు.ర్యాలీలో హర్ ఘర్ తిరంగా రాష్ట్ర కోకన్వీనర్, రాష్ట్ర బీజేవైఎం ఉపాధ్యక్షులు నరేడ్ల ప్రవీణ్ రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, బీజేపీ రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాలతో పట్టణ వీధుల్లో సాగిన ర్యాలీ ప్రజలను ఆకట్టుకుంది. బీజేపీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొంటూ దేశభక్తి నినాదాలు చేయడంతో కార్యక్రమం సందడిగా సాగింది. హర్ ఘర్ తిరంగా స్ఫూర్తితో ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేసేలా ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ర్యాలీ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.

## మెరుగు శివకృష్ణ చొరవతో దివ్యాంగుడికి కృత్రిమ కాలు అందజేత



- **దేవుళ్లు ఎకోడో ఉండరు ఇలాంటి సేవమూర్తులు మధ్యలోనే ఉంటారు**

**కూకట్‌పల్లి, ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):**గజ్వేల్‌కు చెందిన సాయిలు ప్రమాదంలో తన ఎడమ కాలును కోల్పోయి చాలా కాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నారు. రోజువారీ పనులు చేసుకోవడంలో కూడా ఇబ్బందులు పడుతున్న ఆయన పరిస్థితిని తెలుసుకున్న తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ వెంటనే స్పందించారు. సాయిలుకు అవసరమైన సహాయం అందించేందుకు భారత్ వికాస్ పరిషత్ వికలాంగుల పునర్వసతి కేంద్రం ట్రస్ట్ను సంప్రదించి, కృత్రిమ కాలు అందేలా చర్యలు చేపట్టారు. మెరుగు శివకృష్ణ చొరవతో సాయిలుకు కృత్రిమ కాలు అందడంతో ఆయన జీవితంలో కొత్త ఆశలు చిగురించాయి. ఇకపై రోజువారీ పనులను మరింత సులభంగా నిర్వహించుకునే అవకాశం లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు వేల్పుగొండ వెంకటస్వామి హాజరయ్యారు. శాంతి వికలాంగుల సంఘానికి చెందిన గంటి భ్రమరాంబతో పాటు భారత్ వికాస్ ట్రస్ట్ మేనేజర్ నరేంద్ర, టెక్నీషియన్లు రఘు, మధు, స్వామి, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెరుగు శివకృష్ణ మాట్లాడుతూ సమాజంలో ఇంకా అనేక మంది దివ్యాంగులు సహాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దాతలు ముందుకు వచ్చి పేద కుటుంబాలకు చెందిన దివ్యాంగులకు విద్య, ఉపాధి, వైద్యం, వివాహం వంటి అంశాల్లో ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన భారత్ వికాస్ ట్రస్ట్‌కు దివ్యాంగుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అవసరంలో ఉన్న ప్రతి దివ్యాంగుడికి అండగా నిలవడం మనందరి సామాజిక బాధ్యత అని మెరుగు శివకృష్ణ పేర్కొన్నారు.

## ముల్కనూరులో అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం



**భీమదేవరపల్లి, ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):** ముల్కనూరు గ్రామానికి చెందిన మద్ది నర్సమ్మ (65) అదృశ్యమైన ఘటన విషాదాంతమైంది. ఈ నెల 9న ఇంటి నుంచి బయటకు వెళ్లిన నర్సమ్మ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, ఇరుగుపొరుగు వారిని ఆరా తీశారు. అయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో ఆమె కుమారుడు మద్ది అజయ్ ఈ నెల 10న ముల్కనూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు .ఈ క్రమంలో బుధవారం ముల్కనూరు ఎంసీఆర్‌బీ బ్యాంకు వెనుక ఉన్న చెట్ల పొదల్లో గుర్తుతెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. పోలీసులు, గ్రామస్తులు అక్కడికి చేరుకుని పరిశీలించగా, అది అదృశ్యమైన మద్ది నర్సమ్మ మృతదేహంగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం సమీపంలో పురుగుల మందు డబ్బా లభించడంతో ఆమె పురుగుల మందు సేవించి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## హర్గర్ తిరంగా హర్గర్ తిరంగా ప్రతి ఇంటి మీద జెండా ఎగర వెయ్యాలి

- **జాతీయ ఐక్యత సమగ్రతను కాపాడుదాం**



**కాప్రా, ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):** దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు పిలుపు మేరకు కాప్రా వంపుగూడలో ఘనంగా నిర్వహించారు. వంపుగూడకు చెందిన బీజేపీ నాయకుడు నిశాంత్ తన నివాసంతో పాటు స్థానిక కాలనీలోని పలు ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తి నినాదాలతో సందడి చేశారు. చిన్నారుల చేతుల్లో త్రివర్ణ పతాకాలు రెపరెపలాడుతూ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిశాంత్ మాట్లాడుతూ, ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా దేశభక్తిని, జాతీయ గర్వాన్ని చాటాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల త్యాగాలను రాబోయే తరాలకు తెలియజేసి, వారిలో దేశభక్తి భావాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపును ప్రతి ఒక్కరూ స్వీకరించి 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొని జాతీయ గీతాన్ని ఆలపించారు.

# విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుపై కలెక్టర్ సమీక్ష

- **176 కాంపిటెంట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం**
- **ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల అమలుపై సుదీర్ఘ చర్చ**
- **విద్యా ప్రమాణాల మెరుగుదలకు కార్యాచరణపై దృష్టి**



**ఆదిలాబాద్, ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మరింత మెరుగుపరచడం, ప్రాథమిక స్థాయిలో విద్యా నాణ్యతను పెంపొందించడం లక్ష్యంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 176 కాంపిటెంట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సముదాయాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులతో నిర్వహించిన ఈ సమావేశంలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల అమలు, విద్యార్థుల అభ్యసన స్థాయిలు, బోధనా విధానాలు, పాఠశాలల పనితీరుపై సమగ్రంగా చర్చించారు. ప్రాథమిక విద్యలో బలమైన పునాది ఏర్పడితేనే విద్యార్థులు ఉన్నత తరగతుల్లో మెరుగైన ప్రతిభ కనబరుస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల ప్రస్తుత స్థితిగతులను సమీక్షిస్తూ విద్యార్థుల చదవడం, రాయడం, గణిత నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థి నిర్దేశిత అభ్యసన లక్ష్యాలను చేరుకునేలా ఉపాధ్యాయులు క్రమబద్ధమైన కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల నేర్చుకునే సామర్థ్యాన్ని నిరంతరం అంచనా వేస్తూ అవసరమైన చోట ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. బలహీనంగా ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి అదనపు శిక్షణ అందించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పాఠశాలల్లో అమలవుతున్న విద్యా కార్యక్రమాల ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ నాణ్యమైన బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. కేవలం హాజరు శాతం పెరగడం మాత్రమే కాకుండా విద్యార్థులలో నిజమైన అభ్యసన ఫలితాలు కనిపించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు సృజనాత్మక పద్ధతులను అవలంబించి విద్యార్థుల్లో ఆసక్తిని పెంచేలా బోధన నిర్వహించాలని సూచించారు. పాఠశాలల మధ్య ఉత్తమ విధానాలను పంచుకోవడం ద్వారా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచవచ్చని అభిప్రాయపడ్డారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం విజయవంతంగా అమలైతే ప్రాథమిక విద్యా వ్యవస్థలో గణనీయమైన మార్పు తీసుకురావచ్చని సమావేశంలో చర్చించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిలను క్రమం తప్పకుండా పరిశీలించడం, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, పాఠశాల స్థాయిలో ప్రత్యేక కార్యాచరణలు చేపట్టడం వంటి అంశాలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల పురోగతిని నమోదు చేస్తూ లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి మాధవి విద్యా కార్యక్రమాల అమలు తీరును సమావేశంలో వివరించారు. పాఠశాలల పనితీరు, విద్యార్థుల అభ్యసన పురోగతి, ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలు, ప్రభుత్వ లక్ష్యాల అమలు అంశాలపై సమగ్ర నివేదిక సమర్పించారు. రాష్ట్ర ఎఫ్ఎల్ఎన్ బృందం సభ్యులు కూడా కార్యక్రమానికి సంబంధించిన సాంకేతిక అంశాలను వివరిస్తూ పాఠశాలల స్థాయిలో అనుసరించాల్సిన పద్ధతులపై సూచనలు అందించారు. విద్యా రంగంలో నాణ్యత పెంపు కోసం సమిష్టి కృషి అవసరమని వారు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, ఏఎంఓ లక్ష్మణ్, అజయ్, సీఎంఓ తిరుపతి, రాష్ట్ర ఎఫ్ఎల్ఎన్ బృందం సభ్యులు నిఖిల్, వెంకటేష్, నికితతో పాటు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యంగా విద్యాశాఖ పనిచేస్తోందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు పాఠశాల స్థాయిలో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. జిల్లాలో విద్యా ప్రమాణాల పెంపుకు ఈ సమీక్ష ఉపయోగపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# భారత్ అమెరికా ఎన్నికల సహకారం బలోపేతం

- **జ్ఞానేశ్ కుమార్‌తో అమెరికా రాయబారి భేటీ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 12 (తెలంగాణ ముచ్చట్లు):** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్, అంతర్జాతీయ ప్రజాస్వామ్యం-ఎన్నికల సహాయ సంస్థ సభ్య దేశాల మండలి అధ్యక్షుడు జ్ఞానేశ్ కుమార్‌తో భారతదేశంలోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ బుధవారం సమావేశమయ్యారు. న్యూఢిల్లీలోని నిర్వచన్ సదన్‌లో జరిగిన ఈ భేటీలో భారత్, అమెరికా మధ్య ప్రజాస్వామ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించారు. ఎన్నికల వ్యవస్థల నిర్వహణ, ప్రజాస్వామ్య ప్రక్రియల బలోపేతం, ఎన్నికల సిబ్బంది సామర్థ్య పెంపు వంటి అంశాలు చర్చకు వచ్చినట్లు భారత ఎన్నికల సంఘం తెలిపింది. ఇరు దేశాలు ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడంలో తమ ఉమ్మడి నిబద్ధతను మరోసారి స్పష్టం చేశాయి. ఇటీవల జరిగిన అంతర్జాతీయ ప్రజాస్వామ్యం, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సదస్సులో వ్యక్తమైన దృక్పథానికి అనుగుణంగా ప్రజాస్వామ్య సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించాయి. ఎన్నికల నిర్వహణలో పరస్పరం అనుభవాలను పంచుకోవడం ద్వారా రెండు దేశాల ఎన్నికల సంస్థలకు ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అనుసరిస్తున్న విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు వంటి అంశాలపై పరస్పర అనుభవాలను పంచుకునే అవకాశం ఉంది. ఎన్నికల వ్యవస్థల్లో మారుతున్న సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించుకోవడం అవసరమని సమావేశంలో ప్రాధాన్యం ఇచ్చారు. ఈ సహకారం ద్వారా ఎన్నికల నిర్వహణలో ఉత్తమ విధానాలను పరస్పరం తెలుసుకునే అవకాశం కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ అందించే అంశంపై కూడా ఇరుపక్షాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. ఎన్నికల విధుల నిర్వహణలో సిబ్బంది సామర్థ్యం కీలకమని, వారికి నిరంతరం శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అవసరమని అభిప్రాయపడ్డారు. ఎన్నికల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక పద్ధతులు, ఓటర్ల సేవలు, ప్రక్రియల నిర్వహణ వంటి అంశాల్లో శిక్షణను విస్తరించేందుకు సహకరించుకోవాలని నిర్ణయించారు. రెండు దేశాల ఎన్నికల వ్యవస్థల్లోని అనుభవాలను అధ్యయనం చేయడం ద్వారా సిబ్బందికి మరింత విస్తృత అవగాహన కల్పించవచ్చని పేర్కొన్నారు.

# తుమ్మనపల్లిలో ఘనంగా గ్రామ సభ

- **పింఛన్ల దరఖాస్తులకు ఈ నెల 18 వరకు అవకాశం – గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చ**



**హుజురాబాద్,ఆగస్టు 12(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ అన్నాడి మాధవిరవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించారు.
